# భవదీయుడూ - పారిజాతమూ

ఇంకా వర్షం పడుతూనే ఉంది....ఉదయం నించీ పడ్డది చాలనట్లు. ఆఫీసులో కూర్చోడాన్న బయటజరుగుతున్న భీభత్సం కళ్లకి కనిపించకపోయినా, రూములో చలివేసేంత చల్లదనమూ అప్పుడూ అప్పుడూ మెరుపులూ కొంత ఉధృతం ఉన్నట్లు చెప్తూనే ఉన్నాయి. ఎంచేతనో ఎలెక్ట్రిసిటీ మాత్రం ఆగిపోలేదు.

ఐదున్నర ఐపోయింది. ఇంక బయలు దేరకపోతే ఇంటికి వెళ్ళేందుకు మరీ ఆలశ్యం ఔతుంది. దారిలో ఏ చెట్లూ పడి రోడ్డు అగమ్యంగా అవకూడదని దైవాన్ని ప్రార్థిస్తూ వరండాలోకి వచ్చి లిఫ్టు కోసం నిలబడ్డాను.

మా ఆఫీసు నాలుగో ఫ్లోర్‌లో ఉంది. అందరు ఆఫీసర్లూ ఆకాశానికి దగ్గిరగా లాగా, వాస్తవికతకి దూరంగా లాగా అక్కడ కూర్చుంటాము. సామాన్యంగా ఐదుగంటలకి

అందరమూ కలిసి దిగి వెళ్ళేవాళ్లం. ఇవేళ వాళ్లెవరూ కనిపించలేదు - బహుశా నాలుగుగంటలకే వెళ్ళిపోయి ఉంటారు.

లిఫ్టు వొచ్చింది. నేనూ, సిపాయీ క్రిందికి దిగాం. కారు తెచ్చేందుకు తాళాలు తీసుకుని వెళ్ళేడు వాడు.

సిగరెట్ వెలిగించి ఎదురుచూస్తూ ఇటూ అటూ చూస్తున్నాను - అప్పుడే మెట్లుదిగి వొస్తూ నన్ను చూసింది రాజేశ్వరి.

చివరి మెట్టు మీద ఆమె నిలబడిపోయింది.

నోటిదగ్గరకి వెడుతోన్న సిగరెట్ చెయ్యి మధ్యలో అలాగే ఆగిపోయింది.

క్షణకాలం మా ఆశ్చర్యంలో కాలం కరిగిపోయి ఆగిపోయింది.

---

'లా' చదవడం ముగించి, ప్రాక్టీసు పెట్టడమా, ఉద్యోగానికి వెళ్లడమా అని మీమాంస చేస్తోన్న రోజుల్లో రాజేశ్వరి పరిచయం అయింది నాకు.

ఆమె అప్పుడే ఆనర్సు సెకండ్ క్లాస్‌లో పేస్ ఐ ఏం చెయ్యటమో ఆలోచిస్తోంది. యూనివర్సిటీలో తరుచు కలుసుకుంటోన్న వందమందిలో ఆమె ప్రత్యేకంగా అప్పటి దాకా నాకు పరిచయం లేదు. ఒక సాయంత్రం ఏమీ తోచక రామకృష్ణా బీచ్‌దగ్గరకి వెడితే అక్కడికి ఆమె వాళ్ల నాన్నగారితో వొచ్చింది. సముద్రంవైపు చూస్తూ తన్మయత్వంలో ఉన్న నేను ఆమె రాకని గమనించనేలేదు ఆమె "నమస్కారమండీ!" అని పలకరించేదాకా.

ప్రతినమస్కారం చేసిన కొద్ది క్షణాలు ఆమె ఎవరో జ్ఞాపకమే రాలేదు. నన్ను తండ్రికి పరిచయం చేస్తూంటే మాత్రం తెలిసింది ఆమె యూనివర్సిటీలో నన్ను చూసిందని.

ఆయన పోలీస్ సూపరింటెండ్‌గా పనిచేసి రిటైరయాడు - పెళ్లయిన ఇద్దరు అమ్మాయిలు, పెళ్లికాని రాజేశ్వరీ ఆయన పిల్లలు. రాజేశ్వరికి రిసెర్చ్ చెయ్యాలని ఉంది. లా చదివి లాయరవాలని ఆయన ఉద్దేశం.

అదీ ఇదీ మాట్లాడుకున్నాక ఆయన నాతో "మీరు లా చదివారు. మీ సలహా ఏమిటి రాజేశ్వరి విషయంలో?" అన్నారు.

అట్టే ఆలోచించకుండానే, "రిసెర్చ్‌లోకి వెళ్లమనండి - లా చదివినా లాభం ఏమిటి?" అన్నాను.

బహుశా, జీవితంలో నేను చేసిన పెద్ద పొరపాట్లలో అది ఒకటని అని అనుకుంటాను - ఆ క్షణంలో రాజేశ్వరివైపు నేను చూడలేదు. కాని, తరువాత...

బాగా చీకటి పడ్డాక లేచాము. రాజేశ్వరి ఏదో అప్పుడూ అప్పుడూ చెప్తోంది గాని, ఆ సాయంత్రం నన్ను కలుసుకుని పరిచయం చేసినప్పటి ఉత్సాహం ఆమెలో నాకు కనిపించలేదు.

మహరాణీ పేటదాకా వొచ్చి ఎవరి ఇళ్లకి వాళ్లం వెళ్ళిపోయాము. కాని, ఆ రాత్రినించీ రాజేశ్వరి చాలాసార్లు జ్ఞాపకం వచ్చేది. దైహిక సౌందర్యానికి అతీతమైన ఆకర్షణ ఏదో ఆమెలో ఉండేది. చాలా హుందాగా, ..గం దాచుకున్న ఆమె చిరునవ్వులో దాచుకున్న దేదో నన్ను పదే పదే బాధ పెట్టసాగింది.

మరో వారం తరవాత మళ్లీ రాజేశ్వరిని వాల్తేరు స్టేషనులో కలుసుకున్నాను నాన్నగారు ఏదో పనిమీద పెద్దఅల్లుణ్ని చూసేందుకు బెజవాడ వెడుతున్నారనీ, దిగబెట్టడానికి వచ్చేననీ చెప్పింది.

రైలు అప్పుడే వెళ్లిపోయింది. 'పదండి ఇంటిదాకా మిమ్మల్ని దిగబెట్టి వెడతాను' అన్నాను.

'వద్దు. మీరేదో పనిమీద వొచ్చి ఉంటారు. రిక్షా తీసుకుని నేను వెడతాను' అంది రాజేశ్వరి.

"ప్రత్యేకమైన పని ఏమీ లేదు - ఏమీ తోచక వొచ్చాను పదండి పోదాం అన్నాను.

ఇద్దరమూ బయటికి వొచ్చి రిక్షా ఎక్కడం ఇష్టంలేక నడవసాగాము, సరస్వతీ టాకీస్ వచ్చేసరికి ఏదో ఇంగ్లీష్ చిత్రం ఉండడం జ్ఞాపకం వొచ్చి, 'పిక్చర్‌కి పోదామా?' అన్నాను సంశయిస్తూ.

"బాగుంటుందా?" అంది రాజేశ్వరి.

"తెలీదు. చూస్తే తెలుస్తుంది." అన్నాను.

ఆమె హాలుకి దారితీసింది. బుకింగ్ ఆఫీసు దగ్గరికి వెళ్లాక ఆమె టికెట్స్ కొనబోయింది. బలవంతాన వారించి నేను డబ్బిచ్చి తీసుకున్నాను.

"ఏం? నేనివ్వకూడదా?" అంది రాజేశ్వరి మెట్లెక్కుతూ.

"కూడదు. అమ్మాయిలు ఖర్చు చేసే సమయాలు వేరుగా ఉన్నాయి." అన్నాను.

సినిమా ఐపోయేదాకా ఆమె నాతో మాట్లాడలేదు. తరవాత ఆమెని ఇంటికి తీసికెళ్లి నేను వెళ్లిపోయాను. ఆరాత్రి ఆమె లోపలికి రమ్మంటుందని నేను అనుకోలేదు కాని, ఆమె భోజనం చేసి వెళ్లమంది - కాదని వెళ్లిపోయాను.

ఆ తరువాత రెండు మూడు నెలలు రాజేశ్వరీ, నేనూ కలుసుకోలేదు. నేను

కాంపిటీటివ్ పరీక్షలకి చదువుతూ కూర్చున్నాను రాజేశ్వరి రిసెర్చ్ చెయ్యడానికి యూనివర్సిటీలో జాయిన్ అయింది.

సెంట్రల్ సర్వీసెస్‌లో నాకు సెలక్షను వొచ్చి ఇన్‌కమ్‌టాక్సుకి ఎలాట్‌మెంట్, వచ్చే దాకా రాజేశ్వరికి ఈ సంగతి తెలియలేదు. కలకత్తా వెళ్ళేందుకు పిలుపు వొచ్చింది. ఆమెని చూడాలని అనుకుంటూనే ఆలశ్యం ఐపోయింది.

ఆ రోజు యూనివర్సిటీకి వెళ్లాను ముఖ్యంగా స్నేహితులనించి సెలవు తీసుకునేందుకు. ఆర్ట్సు కాలేజిలో రాజేశ్వరి కనిపించి "ఇవాళే మీ సెలక్షన్ సంగతి తెలిసింది ! - కంగ్రాట్యులేషన్స్" అంది.

ఆమె దాలా నొచ్చుకున్న సంగతి ఈ ఒక్క సారీ దాచుకోలేకపోయింది. నేనూ బాధపడినా క్షమాపణ ఎలాగ చెప్పాలో తెలియక, "థాంక్స్" అన్నాను.

"ఎప్పుడు వెడతారు? ఎక్కడికి?" అంది నడుస్తూనే రాజేశ్వరి.

"రేపు కలకత్తా మెయిల్‌లో" అని చెప్పాను.

"జ్ఞాపకం ఉంచుకొంటారుగా!" అని, నన్నువొదిలి వెళ్ళబోయింది.

ఆ క్షణంలో జ్ఞానోదయం ఐంది నాకు ఈమె నాకెంత దగ్గరో, కలిసి వొచ్చిన అదృష్టంలో ఆమె కెంత ప్రాముఖ్యత ఉందో. ఈమె నాతో రేపు వచ్చేస్తే! అనిపించింది.

"ఒక్క క్షణం ఆగండి మీతో మాట్లాడాల్సి ఉంది. మీ నాన్నగారితో కూడా. ఆరుగంటలకి వొస్తాను.." అన్నాను.

"వొద్దు. ఇక్కడే సెలవు తీసుకుందాం. ఇంకేం 'ఉంది మాట్లాడ్డానికి?" అని, తొందరగా నడిచి వెళ్లిపోయింది రాజేశ్వరి.

ఆ సాయంత్రం వాళ్లింటికి వెళ్లేను. ఆమె ఎక్కడికో వెళ్లింది - ఆయనతో పది నిముషాలు మాట్లాడి రాజేశ్వరి మాట ఎత్తాను.

" ఈ సాయంత్రమే ఆమె నాకు 'వార్నింగ్' ఇచ్చింది తన పెళ్లి మాట కాని, తన ఏ విషయం గాని మీతో మాట్లాడవొద్దని.." అన్నాడాయన.

గట్టి దెబ్బ తగిలింది నాకు. సెలవు తీసుకుని వెళ్లాను. మళ్లీ ఇదే కలవడం.

బహుశా ఒక నిమిషం పూర్తిగా అలాగ నిలబడి ఉంటాము. వర్షం కురుస్తోనే ఉంది. మా చుట్టూ మనుషులు తిరుగుతూనే ఉన్నారు. మాకు మాత్రం కాలం స్తంభించి పోయింది.

"ఇక్కడి కెలా వొచ్చేరు మీరు?" అన్నాను తేరుకుని.

"పని చేస్తున్నాను. సెకండ్ ఫ్లోర్‌లో రిసెప్షనిష్టుగా - మీరు..."

"సేలరీస్ సర్కిల్‌కి వేశారు. నెల ఐంది ఇక్కడికి వొచ్చి... నాన్నగారు..."

"ఆయన రెండేళ్లైంది పోయి" అని, "ఆయన ఉంటే ఉద్యోగం చేస్తానని ఎలా అనుకున్నారు?" అంది రాజేశ్వరి.

ఆమె అట్టే మారలేదు.

డ్రైవరు కారు తెచ్చాడు. "పదండి మిమ్మల్ని డ్రాప్‌చేసి వెడతాను. ఎక్కడ ఉంటున్నారు?" అన్నాను.

"కరోల్‌బాగ్‌లో - కాని, మీకు శ్రమ ఎందుకు? బస్‌లో రోజూ వెడుతూనే ఉన్నాను" అంది రాజేశ్వరి.

"పదండి"

కనాట్ ప్లేసుకి పోయి గేలార్డ్స్‌లో కాఫీ తాగి ఆమెతో బయటికి వొచ్చేసరికి ఏడుంపావు అయింది వర్షం కొంత తగ్గింది.

ఆమె పెళ్లిచేసుకుంది. అతనికి స్పెషల్ పోలీస్‌లో ఉద్యోగం. నాన్నగారి అప్పులకీ ఆస్తులకీ సరిపోయింది. ఈ విషయం మాత్రం ఆమె చెప్పింది.

"ఆయన కేంప్ వెళ్లేరా?" అన్నాను.

"ఆం నాగపూర్. రేపు వొస్తారు" అంది.

మూడేళ్లక్రితం ఆమె నావిషయంలో ఎందుకలాగ ప్రవర్తించిందో అడగాలని ఉంది. కాని.... కాని.....

అడిగాను. ఈవేళ ఆమె చెప్పినా నా బాధ తగ్గడంకన్నా ఫలితం లేదు.

ఆమె చాలా సేపటిదాకా జవాబివ్వలేదు కాని, తరువాత "మా ఇంటికి రండి చెప్తాను" అంది.

"వొద్దు ఇక్కడే చెప్పండి." అన్నాను.

"నిజంగా మీకు తెలీదా?" అంది రాజేశ్వరి

"తెలీదు" అన్నాను. అది నిజం కనుక.

"మనమధ్య ఒక అనంత వలయం వొచ్చేసింది రావుగారూ! నా ప్రవర్తనని మీకు చెప్పను. నేను చెప్పందే అర్థం చేసుకోలేరు, మీరు. ఇక్కడ ఆపేద్దాం..."అంది రాజేశ్వరి.

"అంటే?" అన్నాను.

"ఇక్కడ దిగాలి ఆగండి"

కారు ఆపేను. చిన్న చినుకులు పడుతూనే ఉన్నాయి. రాజేశ్వరి దిగి "దానికి అర్థం కూడా నేను చెప్పలేను. మీరు వెళ్లండి"అని చాలా తొందరగా నడిచి వెళ్లిపోయింది.

పటేల్ నగర్‌కి బయలు దేరేను నేను. తలనిండా వెయ్యి ఆలోచనలు. రాజేశ్వరి ఏమిటి దాచుతోంది? నేను చేసిన నేరం ఏమిటి?

ఆలోచిస్తూనే కారు గేరేజిలో పెట్టి తలుపు తట్టేను.

స్వర్ణ తలుపు తీస్తూ, "ఇంత ఆలస్యం ఐందేం?" అంది

"చూశావుగా వర్షం..." అన్నాను.

"చూశాను.. మరి కారులో వొస్తే మిమ్మల్ని వర్షం ఎలాగ ఆపింది?" అంది.

సమాధానం చెప్పకుండానే విసుగ్గా లోపలికి నడిచి సోఫాలో కూలబడ్డాను. తలుపు వేసి లోపలికి వొస్తూ, "నాకు మీరు Explanation ఇవ్వొద్దుగాని, టీ కావాలో, కాఫీ కావాలో చెప్పండి" అంది.

"ఏదో ఒకటి ఇయ్యి" అన్నాను.

"భగవాన్! ఏం మనుషులు మీరు !" అంది స్వర్ణ.

ఆమె నిట్టూర్పుతో నాకు మూడేళ్ల క్రిందటి రాజేశ్వరి జ్ఞాపకం వొచ్చింది. ఆమెతో మాట్లాడిన ప్రతిమాటా ఎంతో స్పష్టంగా జ్ఞాపకం వొచ్చింది. హఠాత్తుగా, ఆ నిట్టూర్పులో రాజేశ్వరి దాచుకున్నదంతా తెలిసింది.

"టీ తెచ్చి పెట్టు స్వర్ణా!" అని సిగరెట్ తీసుకున్నాను. పారిజాతాల ఎరుపు అంతా వేదన కాదు... ఆ రాగంలో చాలా విషయాలు దాగి ఉండవొచ్చును. అంతా చూసేవాళ్లలో ఉంది.

స్వర్ణ టీ తెచ్చింది.

❋ ❋ ❋